క్లుప్తంగా

ఆర్అండ్‌బీ ఏఈఈగా అరుణ్ రెడ్డి


అరుణ్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రమైన పాపన్నపేటకు చెందిన అరుణ్ రెడ్డి ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు అందుకున్న ఆయన వెంటనే ఓరియెంటేషన్ శిక్షణకు వెళ్లారు. పాపన్నపేట, మెదక్‌లో ప్రాథమిక విద్య చదివిన ఆయన.. వర్గల్‌లో నవోదయ, నర్సాపూర్ బీవీఆర్ఐటీ లో ఇంజనీరింగ్ చేశారు. అనంతరం గువహతి ఐఐటీలో మాస్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు.

పీఆర్టీయూ అధ్యక్షుడిగా జనార్దన్


జనార్దన్


రంజ్యానాయక్

అల్లాదుర్గం(మెదక్): పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా బి.జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా డి.రంజ్యా నాయక్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం.నాగరాజు, మహిళా కార్యదర్శిగా సవిత, కార్యదర్శిగా అలీముద్దీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సబ్బాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ, హెచ్ఎం నర్సింలు, రాష్ట్ర బాధ్యులు పి.కిష్టయ్య, జిల్లా బాధ్యులు సత్యనారాయణ, నాగభూషణం, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు తపస్ సన్మానం


ఎంఈఓను సన్మానించిన తపస్ నాయకులు

నిజాంపేట (మెదక్): నిజాంపేట మండలానికి నూతనంగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన సంగాని యాదగిరిని గురువారం మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తపస్ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అభ్యసించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తపస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేయొద్దు

ఆర్టీఏ వెంకటస్వామి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్టీఏ వెంకటస్వామి

మెదక్ కలెక్టరేట్: మైనర్లు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి వెంకటస్వామి అన్నారు. గురువారం మెదక్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీఏ వెంకటస్వామి, షీ టీం అధికారి విజయ్ విద్యార్థులకు డ్రైవింగ్‌తోపాటు పలు సెక్షన్లపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన వాళ్లకు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తామన్నారు. అలాగే వాహనం నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహనాల ఇన్సూరెన్స్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



శివ్వంపేట(నర్సాపూర్): విద్యుత్ షాక్‌తో ఆవు మృత్యువాత పడింది. ఈ సంఘటన మండల పరిధి లింగోజిగూడ తండాలో గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. తండాకు చెందిన రైతు మెగావత్ బాబు తన పాడి గేదెలను మేత కోసం వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లాడు. అవి మేత మేస్తుండగా అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ తగిలి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట(మెదక్): వల్లాభాపూర్ జాతీయ రహదారి పక్కన పంట పొలాల్లో గురువారం మతి స్థిమితం లేని వ్యక్తి మృతి చెంది కనిపించాడు. నార్సింగి ఎస్ఐ అహ్మద్ మోహినొద్దీన్ కథనం మేరకు.. వల్లాభాపూర్ జాతీయ రహదారి పక్కన పొలం వద్ద అనారోగ్యంతో మతి స్థిమితం లేని 50 ఏళ్ల వ్యక్తి వారం నుంచి ఇక్కడే తిరుగుతున్నాడు. ఎవరైనా అన్నం పెట్టినా తినకపోయేవాడు. సరైన బట్టలు వేసుకోలేదు. ఇంతలో జాతీయ రహదారి పక్కన కల్వర్టు పొదల్లో మృతి చెంది గ్రామస్తులకు కనిపించాడు. వారి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్యారానగర్ వద్ద డంప్‌యార్డు వద్దు

- మున్సిపల్ సమావేశం తీర్మానం
- సంతకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి
- వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి: చైర్మన్ అశోక్‌గౌడ్


సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

నర్సాపూర్: గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంప్‌యార్డు ఏర్పాటు చేయొద్దని నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. గురువారం మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్ అశోక్‌గౌడ్ మాట్లాడారు. గుమ్మడిదల్ల మండలం ప్యారానగర్ అటవీ ప్రాంతం నుంచి వాగుల ద్వారా వర్షం నీరు నర్సాపూర్ రాయరావు చెరువులోకి వస్తుందని చెప్పారు. అందుకే డంప్‌యార్డు ఏర్పాటు చేయొద్దని తీర్మానం చేయాలని ప్రతిపాదించగా.. సభ్యులు ఏకగ్రీంగా ఆమోదించారు. పట్టణంలో కొత్తగా మేకలు, గొర్రెల సంత నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతులు ఇవ్వాలని కోరుతూ చైర్మన్ తీర్మానం పెట్టగా సభ్యులు ఆమోదించారు. కౌన్సిలర్ ఇఫ్రత్ సిద్దిఖా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని, అవసరమైన కుటుంబాలకు మందులు సరఫరా చేయాలని కోరారు. శుక్రవారం నిర్వహించే సంతలోకి కార్లు ఇతర వాహనాలు రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కౌన్సిలర్ లక్ష్మి చెప్పారు. పెద్ద వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలు ఎక్కువగా కురవడంతో దోమలు బాగా ప్రబలుతున్నాయని, కౌన్సిలర్లు పంబాల లక్ష్మి, సునీత చెప్పారు. తమ వార్డులలో ఫాగింగ్ చేయాలని కోరగా ఆయా విభాగాల సిబ్బందికి చైర్మన్ పలు సూచనలు చేశారు. సమావేశంలో ఇంకా పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో పీఆర్‌డీ ఈఈ రాధిక లక్ష్మి, కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ మధుసూదన్, ఏఈ కిష్టయ్య పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన


రేగోడ్ పంచాయతీ కార్యదర్శుల నిరసన

అల్లాదుర్గం(మెదక్): నల్లగొండ జిల్లా కలెక్టర్.. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ కార్యదర్శుల బాధ్యుడు ఆర్ లింగప్ప మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకు సరిపడా నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, పర్యవేక్షకులు శంకర్, పంచాయతీ కార్యదర్శులు ప్రభాకర్, ఉదయ్, ఖయ్యూం, అనిత, తుకారం, కార్యాలయ సిబ్బంది సజ్జత్ అలీ, సీవో జగన్ పాల్గొన్నారు.

రేగోడ్‌లో..

రేగోడ్(మెదక్): మండల కేంద్రమైన రేగోడ్‌లో గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సస్పెన్షన్‌కు గురైన ఎంపీడీఓ, కార్యదర్శిలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు రమేశ్, సోమేశ్వర్, అరుణ్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

తపస్ జిల్లా కార్యదర్శిగా సుమతి



చేగుంట(తూప్రాన్): తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శిగా మండలంలోని రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సుమతిని ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లం పలు మండలాల బాధ్యులతో సమావేశం నిర్వహించి సుమతిని జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఉపాధ్యాయ సమస్యలపై పోరాటంలో తనవంతు కృషి చేస్తానని సుమతి పేర్కొన్నారు.

సరైన చర్యలతో అధిక దిగుబడి

- ఏడీఏ పుణ్యవతి


అంతారంలో వరి పంటను పరిశీలిస్తున్న పుణ్యవతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రైతులు సరైన పంట రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ పుణ్యవతి అన్నారు. గురువారం ఆమె మండల వ్యవసాయాధికారి రాజశేఖర్‌తో కలసి చిలప్‌చెడ్ మండలం అంతారం గ్రామంలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉండి, వెన్ను పైకి వస్తున్న దశలో ఉండడంతో ఎకరానికి 15 కిలోల పొటాష్, 10 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. వరి పంటలో కాండం తొలుచు పురుగు ఉధృతి గమనించామని, దీని నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాములు, లేదా కొరాజెన్ 60 ఎంఎల్, లీటర్ నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ భూపాల్ పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం


తల్లి, బిడ్డ క్షేమం..

నిజాంపేట(మెదక్): ఓ మహిళ గురువారం 108 వాహనంలో ప్రసవించింది. బిహార్ రాష్ట్రానికి చెందిన లక్ష్మీదేవి దంపతులు పొట్ట కూటికోసం నిజాంపేటకు వలస వచ్చారు. ఇక్కడి శ్రీ చక్ర పౌల్ట్రీఫామ్‌లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. నిండు గర్భిణి అయిన లక్ష్మీదేవికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో నంది గామ గ్రామానికి చెందిన ఆశ వర్కర్ గౌరీ 108 సిబ్బందికి సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి తరలిస్తుండగా.. వాహనంలో ప్రసవించింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగానే ఉన్నారు. కాగా, సిబ్బంది స్వామి, అసిఫ్‌ను అధికారులు అభినందించారు.

కుంటలు కబ్జా

- చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని కొంతన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న కుంటలను కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామ పరిధిలో ఉన్న కరీం, మాసాని కుంటల శిఖం భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి పలు కట్టడాలు కట్టారని రైతులు నాగేశ్వర్‌రావు, భూమలింగం, శంకర్, మహేష్, నాగేష్, వెంకటేష్, సత్తయ్య, శ్రీరాములు అన్నారు. కుంటలకు వెళ్లే నక్షా దారిని సైతం కబ్జా చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేసినప్పటికి వాటిని సైతం తొలగించారని పేర్కొన్నారు. శిఖం భూములతో పాటు నక్షదారిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి తహసీల్దార్ కమలాద్రికి ఫిర్యాదు చేశారు.

జీఓ 25ను రద్దు చేయాలి

- ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

వెల్దుర్తి(తూప్రాన్): జీఓ 25ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలనే డిమాండ్‌తో మాసాయిపేట మండల ఉపాధ్యాయ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులను నిర్ణయించడం సమంజసం కాదన్నారు. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాష, నవీన్, హరిరంజన్‌శర్మ, నరేందర్‌రావ్, అశోక్, ధర్మపురి, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేటలో...

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలోని మోడల్‌స్కూల్‌లో గురువారం భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ జీఓ ప్రకారం 1–10 వరకు ఒక ఉపాధ్యాయుడు, 11–60 వరకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలనే నిబంధన ప్రాథమిక విద్యను దెబ్బతీసేదిలా ఉందన్నారు. వెంటనే జీఓను రద్దు చేసి ఉపాధ్యాయుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయ సంఘాల నేతల నిరసన

సంక్షిప్త వార్తలు

◆ సీసీ పుటేజీ బయట పెట్టాలి

శివ్వంపేట(నర్సాపూర్): గోమారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటి వద్ద జరిగిన సంఘటనకు సంబంధించి సీసీ కెమెరా పుటేజ్ బయట పెట్టాలని కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రామిరెడ్డి, మాధవరెడ్డి, నవీన్‌గుప్తా, సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వినాయక శోభాయాత్రలో అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారని చెప్పారు.ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసినట్లు బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నేత చంద్రగౌడ్‌కు లేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్, ప్రభులింగంగౌడ్, షేక్‌అలీ తదితరులు ఉన్నారు.

◆ వైకుంఠరథం బహూకరణ

చిలప్‌చెడ్(నర్సాపూర్): వైకుంఠరథం బహూకరించి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు శీలాంపల్లి గ్రామ యువకుడు ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి. చిలప్‌చెడ్ మండలం శీలాంపల్లి గ్రామానికి వైకుంఠరథం కొనుగోలుకు రూ.1.65 లక్షల చెక్కును అందజేశారు. గ్రామానికి చేసే సేవలో సంతోషానిస్తుందని రాజేందర్ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ముకుందరెడ్డి, భగవంత్‌రెడ్డి, సాయిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

నిజాంపేట(మెదక్): నిజాంపేటకు చెందిన తాళ్లపల్లి అనురాధకు రూ.54 వేలు, నందగోకుల్‌కు చెందిన సుశీలకు రూ.45 వేలు, కన్నాపురం దేవరాజ్‌కు రూ.20వేలు చొప్పున సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందించారు. కార్యక్రమంలో మారుతి, మహేందర్, నసీరొద్దీన్, వెంకటేశ్ గౌడ్, రాజారామ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ రేపు విద్యుత్ వినియోగదారుల ఫోరం సదస్సు

తూప్రాన్: విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ వినియోగదారుల ఫోరం సదస్సు నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈ కె.రాజేందర్ తెలిపారు. తూప్రాన్ విద్యుత్ డివిజన్ పరిధిలోని తూప్రాన్, కౌళ్లకల్, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట సెక్షన్ల పరిధి విద్యుత్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డుతో నేరుగా వచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ పారిశుద్ధ్యం పనులు చేపట్టాలి

కొడిపల్లి(నర్సాపూర్): అన్ని గ్రామాలలో పారిశుద్ధ్యం పనులు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కొడిపల్లిలో హైవే పక్కన గ్రామ పంచాయతీ కార్మికులు పిచ్చిమొక్కలు, చెత్తను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామాలలో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండేలా చూడాలన్నారు. మంచినీటి సరఫరాలో లీకేజీలు లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి నెల మూడుసార్లు వాటర్ ట్యాంక్ శుభ్రంచేసి క్లోరినేషన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కలీముల్లా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

వీరవనితకు ఘన నివాళి

వీర వనితి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు కోరారు.


వెల్దుర్తి: ఐలమ్మకు నివాళులర్పిస్తున్న రజక సంఘం అధ్యక్షుడు దుర్గప్రసాద్ తదితరులు


టేక్మాల్: ఐలమ్మ చిత్రపటం వద్ద ఎర్రోళ్ల రమేష్ తదితరుల నివాళి


పెద్ద శంకరంపేట: రజకసంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు


కొడిపల్లి: వెల్మకన్నలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు..


రామాయంపేట: నివాళులర్పిస్తున్న బీసీ సంఘం, రజక సంఘం నేతలు


పాపన్నపేట: జూనియర్ కళాశాలలో ఐలమ్మ జయంతి వేడుకలు..


చేగుంట: ఐలమ్మ జయంతి కార్యక్రమంలో ఎంఈఓ నీరజ, నవాతు సురేష్ తదితరులు


నర్సాపూర్: ఐలమ్మకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మాట్లాడుతున్న జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సరస్వతి

మనోహరాబాద్(తూప్రాన్): ఈ ఏడాది మహిళా సమైఖ్య ద్వారా బ్యాంకు లోన్లు ఇవ్వడంలో జిల్లా వెనుకబడిందని, ముందుకు వెళ్లేలా మహిళా సమాఖ్య సభ్యులు కృషి చేయాలని జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సరస్వతి సూచించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన మహిళా సమైఖ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లోకల్ జాతికి సంబంధించిన కోడి పిల్లలు ఒకటి రూ. 110 చొప్పున రేటు ఉందని, ఇట్టి పెంపకం కోసం లబ్ధిదారులను గుర్తించాలన్నారు. లోనులో గేదెలు అవసరమైన వారికి ఇతర రాష్ట్రాల నుంచి తెప్పిస్తామన్నారు. సీఏల లెక్కలు పక్కాగా ఉండాలని, లోన్ల సమయంలో లబ్ధిదారులకు ఇబ్బందికాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం పెంటాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో అలరించిన విద్యార్థులు


కొల్చారం: విద్యార్థుల ప్రదర్శన దృశ్యాలు

కొల్చారం(నర్సాపూర్): మానవ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కళాఉత్సవ్-2024లో మండలానికి చెందిన ఆయా పాఠశాలల విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మొత్తం పది విభాగాల్లో ఈ కళాఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. జానపద, క్లాసికల్ నృత్యాలు, గ్రామీణ స్థాయి జానపద నృత్యాలు, పెయింటింగ్, శిల్పకళ తదితర విభాగాల్లో విద్యార్థులు తమ అద్భుత ప్రతిభను ప్రదర్శించారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సత్యనారాయణరావు మాట్లాడుతూ.. గ్రామీణ స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను బయటకు తీసేందుకు తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ పేర 'కళా ఉత్సవ్-2024' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.


చిన్నశంకరంపేట: నృత్యం చేస్తున్న విద్యార్థులు

అదరగొట్టిన విద్యార్థులు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో నిర్వహించిన కళాఉత్సవ్ కార్యక్రమంలో విద్యార్థులు తమ నృత్యాలతో అదరగొట్టారు. గురువారం జెడ్పీపాఠశాల, కస్తూర్బా, మోడల్‌స్కూల్ విద్యార్థులు కళాఉత్సవ్ పోటీలలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో తమ ప్రతిభను చాటారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించాలి

- ఎంపీ రఘునందన్‌రావు వినతి


ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయించాలని మండల బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండల బీజేపీ నాయకులు రఘువీరారెడ్డి, రవి, అశోక్, సుదర్శన్, నాగేందర్‌రెడ్డి కలిశారు. పోతులబోగూడ నుండి అనంతారం చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ కోసం కేంద్ర నిధులు మంజూరు చేసిందని, కాంట్రాక్టర్ ఆ పనులు చేయడం లేదన్నారు. స్పందించిన ఎంపీ.. సంబంధిత అధికారులకు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వారు తెలిపారు.

బాస్కెట్ బాల్ పోటీలకు జేఎంజే విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న జేఎంజే ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): జేఎంజే పాఠశాలకు చెందిన విద్యార్థులు నాగచైతన్య,, రవిచందర్ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అనిత తెలిపారు. జిల్లాల బేస్‌బాల్ పోటీలలో నాగచైతన్య బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారిని కరస్పాండెంట్ ఆల్ఫోన్స్, పీఈటీ మహేష్ అభినందించారు.